క్లుప్తంగా

24న చొప్పదండి మండల పరిషత్ సమావేశం

చొప్పదండి: మండల పరిషత్ సమావేశం ఈనెల 24న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వేణుగోపాల్ తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ చిలుక రవీందర్ అధ్యక్షతన జరిగే సమావేశానికి అధికారులు తమ నివేదికలతో హాజరు కావాలని కోరారు.

25న జాబ్‌మేళా

చొప్పదండి: పట్టణంలోని చైతన్య జూనియర్ కళాశాలలో ఈనెల 25న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల నిర్వాహకులు తెలిపారు. ఎంఎస్‌ఎన్ లాబరోటరీస్ కంపెనీ ద్వారా నిర్వహించే జాబ్‌మేళాకు ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఇంటర్ మొదటి ప్రయత్నంలో ఉత్తీర్ణులయిన వారు తమ వెంట ధ్రువపత్రాలు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్ కార్డు తీసుకొని రావాలని సూచించారు.

ఊపందుకున్న భూముల రిజిస్ట్రేషన్లు


తహసీల్దార్ నరేందర్

చిగురుమామిడి: చిగురుమామిడి తహసీల్ కార్యాలయంలో నెల రోజుల్లో దాదాపు 135 మంది రైతులకు చెందిన వ్యవసాయ భూములను కొనుగోలు చేసిన రైతులకు రిజిస్ట్రేషన్ చేసినట్లు తహసీల్దార్ నరేందర్ తెలిపారు. శనివారం ఆయన చిగురుమామిడిలో విలేకర్లతో మాట్లాడుతూ.. 2 నెలల క్రితం ఇంత పెద్ద మొత్తంలో రిజిస్ట్రేషన్లు కాలేదన్నారు. వరి కోతలు మొదలు కావడంతో రైతులకు ఆదాయం సమకూరినందున భూముల లావాదేవీలు ఊపందుకున్నాయన్నారు. ధరణి పోర్టల్ మారలేదని, రైతుల భూసమస్యలు తీరడం లేదని అన్నారు. చాలా మంది రైతులు అటు జిల్లా కలెక్టర్ వద్దకు, ఇటు తహసీల్ కార్యాలయానికి వస్తున్నారని, భూముల నమోదులో అనేక తప్పులు దొర్లాయని, వాటిని సరిచేసుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. కలెక్టర్ ఇచ్చిన ఆప్షన్ల ప్రకారం దొర్లిన తప్పులను సరి చేసి మళ్లీ కలెక్టర్ లాగినోకే పంపిస్తున్నట్లు పేర్కొన్నారు.

వంతెన నిర్మించాలి


పొన్నంకు వినతి పత్రం ఇస్తున్న ఉదయ్, రాము

గన్నేరువరం: గన్నేరువరం మండలం మైలారం గ్రామ మైసమ్మ గుట్ట నుంచి కరీంనగర్‌లోని మానేరు డ్యాం కట్ట వరకు మానేరు వాగుపై కిలోమీటరన్నర బ్రిడ్జి నిర్మించాలని శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బ్రిడ్జి సాధన కమిటీ చైర్మన్ సంపతి ఉదయ్‌కుమార్, కార్యదర్శి పుల్లెల రాము విన్నవించారు. కరీంనగర్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. బ్రిడ్జి లేని కారణంగా గన్నేరువరం మండలంతోపాటు బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాలకు చెందిన 80 గ్రామాల ప్రజలకు ప్రయాణ భారంగా పెరిగిందన్నారు. విద్యార్థులకు ఉన్నత విద్య, పేద ప్రజలకు వైద్యం సరైన సమయంలో అందని దుస్థితి నెలకొందని వాపోయారు. ఎన్నికల కోడ్ ముగియగానే బ్రిడ్జి జేఏసీ నాయకులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు.

బీజేపీలో చేరికలు


బీజేపీలో చేరిన నాయకులు

మానకొండూర్: బీజేపీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ సమక్షంలో చెంజర్ల గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల నుంచి బీజేపీలో చేరారు. చెంజర్ల గ్రామ మాజీ సర్పంచ్ జిల్లెల రాజమౌళి బీజేపీలో చేరగా.. బండి సంజయ్‌కుమార్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బోళ్ల రఘు, మాజీ వార్డు సభ్యులు కుమ్మరి శంకర్, ఎదులపురం సతీష్, మునిగంటి శ్రీనివాస్, వరికోలు అజయ్, ఎదులాపురం భాస్కరాచారి, దూలం కుమార్, బర్రె నాగరాజు, గాలిపల్లి శివచరణ్, బండ భానుతేజరెడ్డి, మునిగంటి చందన్ చేరారు. గుర్రాల వెంకటరెడ్డి, రాపాక ప్రవీణ్, కత్తి ప్రభాకర్, అశ్విన్ తేజ, లక్కర్సు శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యాపారులకు నోటీసులు



శంకరపట్నం: మండలంలోని ప్రధాన రోడ్డు వెంట ఇరువైపులున్న వ్యాపారులకు శనివారం గ్రామ పంచాయతీ సిబ్బంది నోటీసులు జారీ చేశారు. రోడ్డు మధ్య నుంచి 50 ఫీట్ల దూరంలో ఉన్న బోర్డులు, రేకుల షెడ్లను తొలగించాలని ఇటీవల ఎంపీడీవో శ్రీవాణి ఆదేశించింది. వ్యాపారులకు గడువు ఇచ్చినా తొలగించకపోవడంతో జీపీ సిబ్బందితో నోటీసులు జారీ చేశారు. నోటీసులను స్వీకరించిన కొంతమంది వ్యాపారులు బోర్డులను తొలగించారు.

సౌర విద్యుత్ రంగంలో అపార అవకాశాలు


సౌర విద్యుత్ ఉపయోగాలను ప్రయోగాల ద్వారా విద్యార్థులకు వివరిస్తున్న వర్క్‌షాపు శిక్షకులు

హుజూరాబాద్‌రూరల్: భవిష్యత్తులో సౌర విద్యుత్ రంగం కీలక పాత్ర పోషిస్తుందని, ఈ రంగంలో విద్యార్థులకు అపార అవకాశాలున్నాయని కిట్స్ కళాశాల డైరెక్టర్ కె.శంకర్ అన్నారు. సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో గ్రీన్ ఎనర్జీ టెక్నాలజీస్ హైదరాబాద్ వారి సంయుక్తంగా నిర్వహిస్తున్న డిజైనింగ్ సోలార్ సిస్టం వర్క్‌షాపు శనివారంతో ముగిసింది. సౌర విద్యుత్ ద్వారా కలిగే ప్రయోజనాల గురించి విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వివరించారు. సౌర విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక రాయితీలను కల్పిస్తున్నాయన్నారు. సంప్రదాయ ఇందన వనరులు రోజురోజుకు తరిగిపోతున్న క్రమంలో సౌర విద్యుత్ రంగం వైపు ప్రభుత్వాలు దృష్టి సారించాయని అన్నారు. విద్యార్థులు సౌర విద్యుత్‌తో పని చేసే పరికరాలను తయారు చేసేందుకు ప్రాజెక్ట్ వర్క్ చేయాలన్నారు. అనంతరం వర్క్‌షాపు శిక్షకులు పురుషోత్తమాచారి, డాక్టర్ కె.శంకర్ విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఈశ్వరయ్య, సమన్వయకర్తలు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతు

సాక్షి స్పందన

చిగురుమామిడి: సుందరగిరి–బొమ్మనపల్లి గ్రామాల మధ్య లీకేజవుతున్న మిషన్ భగీరథ పథకం పైపులైన్‌కు అధికారులు మరమ్మతు చేశారు. ఈనెల 18న సాక్షి దిన పత్రికలో పైపులైన్ లీకేజీని పట్టించుకునే వారేరీ అనే కథనానికి మిషన్ భగీరథ పథకం అధికారులు స్పందించారు. దీంతో పోలంపల్లి నుంచి సుందరగిరికి నీరు సజావుగా సరఫరా అవుతోందని పలువురు తెలిపారు.


సుందరగిరి-బొమ్మనపల్లి గ్రామాల మధ్య పైపులైన్‌ను సరిచేసిన అధికారులు

కొత్తగట్టులో..

శంకరపట్నం: కొత్తగట్టులో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీకి శనివారం అధికారులు జీపీ సిబ్బందితో మరమ్మతు చేయించారు. కొత్తగట్టు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మిషన్ భగీరథ పథకం కింద నిర్మించినా నిరుపయోగమే అనే కథనం సాక్షిలో ప్రచురితమైంది. స్పందించిన అధికారులు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఖాజాఫసియొద్దీన్, ఎంపీడీవో శ్రీవాణి, ఎంపీవో బషీరొద్దీన్, పంచాయతీ కార్యదర్శి స్వప్న, ఏఈ మొగిలి గ్రామాన్ని సందర్శించారు. పైప్‌లైన్ లీకేజీ పనులను చేయించిన అనంతరం ట్యాంకును నీటితో నింపి గ్రామంలోని పైపుల ద్వారా ఇంటింటికి నీటిని విడుదల చేశారు.


శంకరపట్నం: మరమ్మతు చేస్తున్న సిబ్బంది

గుర్తుతెలియని వాహనం ఢీ.. హనుమాన్ స్వామికి గాయాలు


శివకుమార్‌ను 108 వాహనంలో తరలిస్తున్న సిబ్బంది

చిగురుమామిడి: మండల కేంద్రం శివారులో పాంబండ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని హనుమాన్ భక్తుడు గాయపడ్డాడు. జనగామ జిల్లా ఎర్రగొల్ల పహాడ్ గ్రామానికి చెందిన బైరగోని శివకుమార్(20) అనే యువకుడు గురువారం హనుమాన్ మాల వేసికొని కొండగట్టుకు పాదయాత్రగా తోటి స్వాములతో కలిసి వెళ్తున్నాడు. రాత్రి కావడంతో సమీపంలోని హనుమాన్ దేవాలయంలో నిద్రించారు. శుక్రవారం వేకువజామున దాదాపు 4.30 గంటల ప్రాంతంలో బీటీ రోడ్డుపై నడిచి వెళ్తుండగా.. హుస్నాబాద్ వైపు నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో శివకుమార్ తల, శరీర భాగాలకు గాయాలయ్యాయి. కుడి కాలు విరగడంతో తోటి స్వాములు తక్షణమే 108 వాహన సిబ్బందికి సమాచారమిచ్చారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పోలోజు సదాచారి బాధితుడికి ప్రథమ చికిత్స అందించారు. పైలట్ మాచమల్ల అశోక్ సహాయంతో సమీపంలోని హుస్నాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

లారీ ఢీకొని దంపతులకు గాయాలు

రామడుగు: లారీ ఢీకొన్న ఘటనలో గోపాల్‌రావుపేటకు చెందిన దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. ఎ.మల్లేశం–భారత దంపతులు శనివారం ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. గుండి గ్రామ సమీపంలో వీరి వాహనాన్ని ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 వాహనంలో కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. బాధితులది పేద కుటుంబం కావడం, ప్రమాద విషయం సోషల్ మీడియంలో వైరల్ అవడంతో దాతలు ముందుకు వచ్చి, చికిత్స నిమిత్తం విరాళం అందిస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జమ్మికుంట: అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ రవి తెలిపారు. విలాసాగర్ గ్రామానికి చెందిన వేల్పుల కుమార్ మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తలిస్తుండగా.. మున్సిపల్ పరిధి ధర్మారంలో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు పట్టుకున్నారు.

ఆధ్యాత్మికం

ఆకట్టుకున్న రామాయణం ప్రదర్శన



జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని రైల్వే స్టేషన్ ఆవరణలోని శ్రీరామాలయంలో శ్రీసీతారాముల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని పెద్ద రథోత్సవం సందర్భంగా రామాయణంలోని పలు ఘట్టాలను వేషధారణలతో చిన్నారులు ప్రదర్శించారు. జోశ్విక నాట్య కళాక్షేత్రం బృందం గురువు బాదేల స్వప్నలత ఆధ్వర్యంలో శ్రీసీతారామచంద్రస్వామి జీవిత చరిత్రను నృత్య రూపంలో ప్రదర్శించారు. చిన్నారుల శ్రీసీతారాముల సన్నివేశాలు, నృత్యాలను భక్తులు అధిక సంఖ్యలో తిలకించి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాట్య కళాబృందం విద్యార్థులు బాదేల యశస్విని, సహస్ర, రూపిణి, సామ్రాట్, స్వాతిక, శాలిని, సంహిత, సరయు, లౌక్య, వైభవి తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

చొప్పదండి: కోనేరుపల్లి గ్రామంలో నిర్మిస్తున్న శ్రీవేణుగోపాలస్వామి ఆలయానికి కాట్నపల్లి ఎంపీటీసీ కట్టెకోల తార, లక్ష్మణ్ దంపతులు రూ.25వేల విరాళం అందించారు. తల్లిదండ్రులు కట్టెకోల రాజమ్మ, చంద్రయ్య జ్ఞాపకార్థం గుడి నిర్మాణానికి విరాళం అందించినట్లు లక్ష్మణ్ తెలిపారు. ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి విగ్రహానికి పూజలు



హుజూరాబాద్‌రూరల్: చెల్పూర్ గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో నెలకొల్పిన అభయాంజనేయస్వామి విగ్రహానికి శనివారం విగ్రహ దాత కుటుంబ సభ్యులు, ఆలయ ధర్మకర్త, ప్రధాన అర్చకుడు ఉదయమర్రి కృష్ణమూర్తిశర్మ, అర్చకుడు శ్రీమాన్ వెంకటాచార్యులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన కాల్వ సదాశివరెడ్డి కుటుంబ సభ్యులు 13 ఫీట్ల అభయాంజనేయస్వామి విగ్రహాన్ని దేవాలయానికి సమర్పించటంతో.. ఆంజనేయస్వామి, పక్కనే ఉన్న రామాలయాల్లో కొత్త శోభ సంతరించుకుంది.

'పార్లమెంట్‌లో గళమెత్తే గొంతుకను గెలిపించండి'


హుజూరాబాద్‌లో వాకర్లతో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

హుజూరాబాద్: కేంద్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా మనకోసం ఒక గొంతుక అవసరమని, మన హక్కులను సాధించుకోవడానికి పార్లమెంట్‌లో గళమెత్తె గొంతుకైన నన్ను గెలిపించాలని బీఆర్‌ఎస్ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ కోరారు. శనివారం హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో వాకర్లతో, పట్టణంలోని పలు హోటళ్లలో, పలు వీధుల్లో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. గతంలో పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలో 136 సార్లు మన సమస్యలపై మాట్లాడినట్లు తెలిపారు. గత ఎన్నికల్లో కరీంనగర్‌లో ఎంపీగా ఓడినా ప్రజలను వదిలిపెట్టి పోలేదని, ఎప్పుడూ ఈ ప్రాంతంలోనే పర్యటనలు చేశానని, ఏ సమస్య వచ్చినా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానన్నారు. ఎంపీ బండి సంజయ్ రాజకీయాల కోసం కాకుండా అభివృద్ధి పనుల కోసం హుజూరాబాద్ నియోజకవర్గంలో ఎప్పుడైనా పర్యటించారా అని ప్రశ్నించారు. హుజూరాబాద్‌లో స్టేడియం పనులను ఆపడం కాంగ్రెస్ నాయకులకు తగదన్నారు. మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీనివాస్, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్, ఐలయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి చేస్తా.. ఆశీర్వదించండి

మానకొండూర్: కేంద్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా నిధులు తెచ్చి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని, రానున్న ఎన్నికల్లో ప్రజలు ఓటేసి ఆశీర్వదించాలని బోయినపల్లి వినోద్‌కుమార్ కోరారు. లక్ష్మీపూర్ గ్రామంలో శనివారం రాత్రి గ్రామస్తులతో సమావేశమై మాట్లాడారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ ఎడ్ల సుగుణాకర్, రవీందర్‌రావు, సతీష్, శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రొడ్డ పృథ్వీరాజ్, నూతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి


బేతిగల్‌లో ప్రచారం చేస్తున్న డాక్టర్ హర్షిణి

వీణవంక: బీఆర్‌ఎస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని వినోద్‌కుమార్ కోడలు డాక్టర్ హర్షిణి కోరారు. బేతిగల్ గ్రామంలో బీఆర్‌ఎస్ అభ్యర్థికి మద్దతుగా ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ మోరే సారయ్య, మాజీ ఉప సర్పంచ్ చొప్పరి తిరుపతి, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కొక్కిరాల శ్రీనివాస్‌రావు, గొట్టిముక్కుల రవీందర్‌రావు, గొర్రె రాజమౌళి, కొక్కిరాల వేణురావు, సారంగం, రాజేశ్, ప్రశాంత్ ఉన్నారు.

పట్టుదలతో చదివి పేరు తేవాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయిలో రాణించి సమాజంలో చదువు చెప్పిన ఉపాధ్యాయులు, చదువుకున్న పాఠశాల, కన్న తల్లిదండ్రులకు గుర్తింపు తేవాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. మండల కేంద్రంలోని వివేకానంద విద్యాలయం వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలు ప్రారంభించారు. క్రీడ, సాంస్కృతిక రంగాల్లోనూ గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. విద్యార్థుల సంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

కూలీలకు వసతులు కల్పించండి


వెన్నెంపల్లిలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న జిల్లా ప్రత్యేకాధికారి అభయ్‌కుమార్

సైదాపూర్: ఎండలు తీవ్రంగా ఉన్నాయి.. ఉపాధి కూలీలు ఎండ దెబ్బకు గురి కాకుండా సిబ్బంది చర్యలు చేపట్టాలని ఉపాధిహామీ పథకం జిల్లా ప్రత్యేకాధికారి అభయ్‌కుమార్ ఆదేశించారు. శనివారం వెన్నెంపల్లి, జాగీర్‌పల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను కమిషనర్ పంచాయతీ కార్యాలయం హైదరాబాద్ నుంచి ఉపాధి హామీ పథకం జిల్లా ప్రత్యేకాధికారి అభయ్‌కుమార్ సందర్శించి పరిశీలించారు. ఉపాధిహామీ పథకంలో చేపడుతున్న పనుల ద్వారా కూలీలకు గిట్టుబాటవుతుందా? లబ్ధి చేకూరుతుందా అని కూలీలనడిగి తెలుసుకున్నారు. పనులు జరిగే ప్రాంతంలో కూలీలకు అన్ని వసతులు కల్పించాలని ఎంపీడీవో యాదగిరిని ఆదేశించారు. డీఆర్‌డీవో శ్రీధర్, అదనపు డీఆర్‌డీవో సంధ్యారాణి, ఏపీవో రాణి, సిబ్బంది ఉన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మహాలక్ష్మి, పీఈటీ జ్యోతి

గన్నేరువరం: గుండ్లపల్లిలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల విద్యార్థి కారుణ్య జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మహాలక్ష్మి తెలిపారు. తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14న మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి అండర్–12 విభాగంలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 21 నుంచి 24 వరకు మహారాష్ట్రలోని దాదర్‌లో జరిగే 17వ జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొననుంది. విద్యార్థి ఎంపికకు కృషి చేసిన పీఈటీ జ్యోతిని ప్రిన్సిపాల్ అభినందించారు. ప్రిన్సిపాల్‌తోపాటు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీను ముదిరాజ్, జిల్లా హ్యాండ్‌బాల్ కమిటీ సభ్యులు హన్మండ్ల భాస్కర్, ఆర్‌సీవో గౌతమ్‌రెడ్డి, పీఈటీ జ్యోతి, పాఠశాల ఉపాధ్యాయులు శనివారం విద్యార్థికి అభినందనలు తెలిపారు.

ధాన్యం తూకం వేయాలి


మాట్లాడుతున్న శ్రీనివాస్

శంకరపట్నం: కొనుగోలు కేంద్రాల్లో పోసిన వరి ధాన్యాన్ని త్వరితగతిన తూకం వేయాలని టీపీసీసీ సభ్యుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాలు, తరుగు పేరిట తూకం వేయకుండా వ్యాపారులు, సహకార సంఘం అధికారులు కొర్రీలు పెట్టొద్దని సూచించారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం వర్షానికి తడవకుండా అధికారులు కాపాడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. బసవయ్య, తిరుపతి, రాజయ్య, రాజిరెడ్డి, శ్రీకాంత్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక


కార్యవర్గ సభ్యులు

గన్నేరువరం: ముదిరాజ్ యూత్ ఆధ్వర్యంలో గన్నేరువరం గ్రామ యూత్ నూతన కార్యవర్గాన్ని శనివారం గ్రామంలో సమావేశమై ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుంభం మహేశ్, ఉపాధ్యక్షుడిగా బోయిని సంతోష్, ప్రధాన కార్యదర్శిగా పాకాల పర్శరాం, కోశాధికారిగా రంగనవేణి దేవరాజ్, రైటర్‌గా దొంతరవేని శేఖర్, కార్యవర్గ సభ్యులుగా దానవేని మధు, బోయిని పెద్దిరాజు, గువ్వ మల్లేశం, రంగనవేణి హరీష్, చొప్పరి తిరుపతి, బోయిని నరేష్, రాగుల చంద్రం ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులను ముదిరాజ్ సంఘం సభ్యులు శాలువాతో సన్మానించి అభినందించారు.

నూతన నియామకం


సరోజన

హుజూరాబాద్‌రూరల్: కందుగుల గ్రామానికి చెందిన కంకణాల సరోజనను జిల్లా రెడ్డి సంఘం మహిళా అధ్యక్షురాలిగా నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

ఆయుర్వేద వైద్యశిబిరానికి స్పందన



తిమ్మాపూర్: రేణికుంట గ్రామంలో పరిపూర్ణ ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరానికి స్పందన లభించింది. గ్రామంలోని సబ్ స్టేషన్ వద్ద క్యాంపు ఏర్పాటు చేసి ఉపాధి కూలీలు, సెంటర్లో పని చేస్తున్న హమాలీలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ హేమలత, మేనేజర్ మమత, థెరపిస్టులు లతామాధవి, భరత్, మౌనిక, నాయకులు బోయిన రాములు, బోయిని సంపత్ పాల్గొన్నారు.

డీఎల్‌పీవో విచారణ



శంకరపట్నం: మొలంగూర్ గ్రామ పంచాయతీలో శనివారం ఇంటి మార్పిడిపై డీఎల్‌పీవో శ్రీనివాస్ విచారణ చేశారు. గ్రామంలో తప్పుడు ధ్రువపత్రాలతో తనకు చెందిన ఇంటిని మార్పిడి చేశారని జిల్లా కలెక్టర్‌కు ఖలీల్ మహమ్మద్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు డీఎల్‌పీవో జీపీ కార్యాలయంలోని ఇంటిని రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తిని, స్థానికులను విచారించారు. ఎంపీవో బషీరొద్దీన్, కార్యదర్శి మమత ఉన్నారు.

గొడిశాలలో పాఠశాల వార్షికోత్సవం



సైదాపూర్: గొడిశాలలో ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా నిర్వహిస్తున్నట్లుగానే పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారుల విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మండల విద్యాధికారి కేవీ నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలరించిన 'ప్రజ్వలన్–24'



రామడుగు: గోపాల్‌రావుపేట శ్రీప్రగతి పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజ్వలన్–24 కార్యక్రమం అలరించింది. శనివారం సాయంత్రం నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులతో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంట్ రాధాకృష్ణ, ప్రిన్సిపాల్ వెంకటనారాయణ, డైరెక్టర్లు కాసార్ల ఆనంద్, బేతి భూమయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ఉప్పుల శ్రీనివాస్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అబద్ధాలు చెప్పడం సరికాదు


మాట్లాడుతున్న అనిల్‌మాదిగ

రామడుగు: రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న రేవంత్‌రెడ్డి ప్రజల ముందు అబద్ధాలు చెప్పడం సరికాదని, ఎస్సీల వర్గీకరణ కోసం సుప్రీంకోర్టులో నియమించిన న్యాయవాది ఎవరో, ఆయన పేరు ఏమిటన్న విషయం బయటపెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్‌మాదిగ అన్నారు. శ్రీరాములపల్లి గ్రామంలో శనివారం విలేకర్లతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి మాదిగలకు చేసింది తక్కువ, చెప్పేది ఎక్కువగా ఉందని విమర్శించారు. చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి తడగొండ శంకర్, మల్యాల వినయ్, చంటి జితేందర్, కొత్తూరి రాజన్న, సముద్రాల శ్రీనివాస్, మల్యాల మధు, బూత్కూరి రామయ్య, చంటి లచ్చయ్య పాల్గొన్నారు.